అదిరెను.. సంబరం


వెంకన్న సేవలో బాలికలు




ఆకట్టుకుంటున్న సిరిపురం పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన సంక్రాంతి సెట్


సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న బషీర్


మహిళల కోలాట బృందం


రంగనాథ కల్యాణం నృత్య రూపకం

విశాఖ విద్య: భోగి వైభోగం ఓ రోజు ముందుగానే వచ్చింది. దీంతోపాటే సంక్రాంతి, కనుమ.. జతకట్టాయి. పండగలన్నీ కలిసి ఒకే చోట కొలువుదీరాయి. ఇంతటి వేడుకల్ని చూస్తే.. సందర్శకుల ఆనందం అంబరాన్నంటదా! ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ వేదికగా మాజీ ఎంపీ(రాజ్యసభ) జీవీఎల్ నర్సింహారావు ఆధ్వర్యంలో మహా సంక్రాంతి సంబరాలు శనివారం అత్యంత వైభవంగా మొదలయ్యాయి. ఎటుచూసినా సంప్రదాయం కొట్టొచ్చినట్లు కనుల ముందు సాక్షాత్కరించింది. డూడూ బసవన్నల చిందులు, తప్పెటగుళ్ల కళాకారుల విన్యాసాలు, కనులు.. చెవులూ ఒకేవైపు ధ్యాసపెట్టేలా మగువల కోలాటాలు, రంగవల్లుల మధ్యలో గొబ్బెమ్మలు.. వాటిచుట్టూ గొబ్బియ్యల్లో అంటూ పాటందుకున్న పడుచులు.. వీటిని చూసేందుకు రెండుకళ్లూ చాలవంటే అతిశయోక్తి కాదు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సంబరాలను ఆర్‌బీఐ డైరెక్టర్ ఏవో బషీర్ ప్రారంభించారు. పల్లె వాతావరణాన్ని గుర్తుకు తెచ్చేలా ప్రాంగణంలో ఏర్పాట్లు చేయటంతో వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజానీకం తరలివచ్చారు. సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు సంబరాల్లో భాగంగా సైబర్ నేరగాళ్ల మోసాలు, ఆర్థిక అంశాల్లో అప్రమత్తతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాల నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన కూడిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముందుగా రంగనాథ కల్యాణం నృత్య రూపకం, వసుదేవ సుతందేవం అంటూ, కొలువైతివా రంగనాథ అంటూ రంగనాథుని మేలుకొలుపుతూ చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలను భక్తులు ఆద్యంతం తిలకించి అభినందించారు. కార్యక్రమం సాయినాథ కళాసమితి నిర్వాహకులు డాక్టర్ అరుణ్ సాయి కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఆలయ మేనేజర్ అడపా దేముళ్లు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

క్లుప్తంగా

ఎంవీపీ శ్రీవారి ఆలయంలో నీరాటోత్సవం


నీరాటోత్సవంలో శ్రీ గోదాదేవి అమ్మవారు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పసుపు దంచి ఆ పసుపుతో గోదా అమ్మవారికి మంగళస్నానం (నీరాటోత్సవం) ఘనంగా నిర్వహించారు. సోమవారం భోగి సందర్భంగా నిర్వహించనున్న గోదా రంగనాథుల కల్యాణోత్సవానికి ముందుగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆఖరి 28వ పాశురం విన్నవించారు. ఆలయ ధర్మకర్త ప్రసాదరావుతో పాటు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ కరాటే పోటీలకు ఏయూ విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఆచార్య విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఏయూ క్రీడాకారులు అర్హత పొందినట్లు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషుల కరాటే పోటీలు 15 నుంచి 18 వరకు ఎండీ యూనివర్సిటీ రోహతక్‌లో జరిగే పురుషుల కరాటే పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థి వి.బాలసూర్య, 19 నుంచి 21 వరకు జరిగే మహిళల పోటీల్లో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల బీకాం విద్యార్థి సీహెచ్ ప్రవల్లిక పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి, విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులను వ్యాయామ విద్య విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు, జట్టు మేనేజర్ అండ్ కోచ్ చిన్నారావు అభినందించారు.

సంక్రాంతికి ఊరువెళ్తున్నారా...

- పోలీసులకు సమాచారమివ్వండి

ఎంవీపీకాలనీ: సంక్రాంతి సందర్భంగా ఊళ్లకు కుటుంబ సమేతంగా వెళ్లేవారు ఇంటి భద్రత దృష్ట్యా స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎంవీపీ కాలనీ క్రైం పోలీసు స్టేషన్ సీఐ చక్రధర్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఎంవీపీలో పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్లకు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇండివిడ్యువల్ ఇళ్లలో ఉండే వారు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి ముందు పాల ప్యాకెట్లు, పత్రికలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటిలో కొన్ని లైట్లు ఆన్‌లో ఉంచుకోవాలని సూచించారు. పోలీసుల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కోడి పందాలు, పేకాట, గుండాట వంటి కార్యకలాపాలు చట్ట విరుద్ధమని, వాటికి ప్రజలు, యువత దూరంగా ఉండాలని సూచించారు.

సింహగిరిపై నేడు గోదా కల్యాణం

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరిపై సోమవారం సాయంత్రం గోదా రంగనాథుల కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎదురు సన్నాహోత్సవం, కల్యాణోత్సవ ఘట్టాలను వైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉదయం జరగాల్సిన నిత్యకల్యాణాన్ని కూడా గోదా కల్యాణంతో కలిపి జరపనున్నారు.

మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి


మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు నిరసన

మద్దిలపాలెం: తెలుగు భాష పరిరక్షణకు మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలుగుదండు ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కూడలిలో తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా తెలుగుదండు సారథి పరవస్తు సూరి మాట్లాడుతూ తెలుగుభాష పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన అధికార భాషాసంఘం 50 ఏళ్లుగా కేవలం సలహా సంఘంగా మిగిలిపోయిందన్నారు. ఎన్నో ఏళ్లగా అధికార భాషాసంఘం స్థానంలో స్వయం ప్రతిపత్తి కలిగిన మాతృ భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని ఉద్యమాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం తెలుగుభాష అభివృద్ధికి నడుం బిగించాలని, వెంటనే మాతృభాషాభివృద్ధి ప్రాధికారసంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్యా బోధన తెలుగులోనే జరగాలని బహిరంగ లేఖలో స్పష్టం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాజమన్నార్, ఆచార్య అయ్యల ప్రసాదరావు, నాగుల శ్రీనివాస్, చిన్న సూర్యనారాయణ, రాజేష్, శ్రీధర్, ఆచార్య సూరప్పడు, శ్రీనివాసరావు తదితర కవులు, కళాకారులు, భాషాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుతల్లికి పుష్పాంజలి సమర్పించారు.

అమ్మప్రేమ అపురూపం


కుమార్తెను ట్రై సైకిల్‌పై తీసుకువెళుతున్న పద్మజ

ఏయూ క్యాంపస్: అమ్మ అనే రెండక్షరాల పదం.. భాషకు అందని భావం. అనంతమైన ప్రేమకు ప్రతిరూపం. తోడుగా అమ్మ ఉంటే ప్రపంచాన్ని జయించ వచ్చనే నమ్మకం బిడ్డది. పుట్టిన ప్రతి ఒక్కరికి ఆది గురువు అమ్మే. అమ్మ గురించి రాయాలంటే ఏ భాషలోని అక్షరాలూ సరిపోవు..! అలాంటి ఎందరో మాతృమూర్తులకు ప్రతిరూపం ఏయూ ఉద్యోగి పద్మజ. ఆమెకు చిన్నప్పుడే పోలియో సోకింది. తన కాళ్లు బలహీనంగా మారినా.. సంకల్ప బలంతో ముందుకు సాగింది. ఏయూలో చిరుద్యోగిగా చేరిన ఆమె తన సామర్థ్యంతో ప్రస్తుతం వర్సిటీలో కీలకమైన పరీక్షల విభాగంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తోంది. ఆమెకు ఒక కుమార్తె. ఉద్యోగిగా బాధ్యతలు ముగించుకున్న తరువాత అమ్మ అవతారంలోకి మారుతుంది. కుమార్తెను తన మూడు చక్రాల వాహనంపై కూర్చోబెట్టుకుని, తిప్పుతూ అనేక కబుర్లు చెబుతుంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది. అంగవైకల్యాన్ని అధిగమించి ఆత్మస్థైర్యంతో జీవితాన్ని సాగిస్తున్న ఈ అమ్మ ఎందరికో స్ఫూర్తిదాయకం.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి


రాజ్యాంగ పరిరక్షణకు కరపత్రాలను అందిస్తున్న కాంగ్రెస్ తూర్పు ఇన్‌చార్జ్ ప్రియాంక దండి

మద్దిలపాలెం: ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని 16వ వార్డులో ఇసుకతోట, అంబేడ్కర్ కాలనీలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించండి, ప్రజా స్వామ్యాన్ని కాపాడంటూ ఆమె కోరారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఎప్పుడూ రాజ్యాంగం పై దాడి చేస్తూనే ఉన్నారన్నారు. కొద్ది రోజుల క్రితం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారని చెప్పారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా వచ్చిన హోంమంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలని ప్రియాంక డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొచ్చా లక్ష్మణ్ రావు, జగన్ మురారి, మని, నాగరాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు 'చారిటీ బాక్స్' సాయం


సరకులు అందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

బీచ్‌రోడ్డు: సంక్రాంతిని పురస్కరించుకుని 'చారిటీ బాక్సు' ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిరుపేదలకు నిత్యావసరాలు అందజేశారు. విశాఖలో శివాజీపాలెం, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, తాటిచెట్లపాలెం, పాత పోస్టాఫీసు తదితర ప్రాంతాల్లో నిరాశ్రయులకు 15 రకాల సామగ్రి, 15 కిలోల బియ్యంతో కూడిన కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధి పాట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ పేదలు కూడా సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని నిత్యావసరాలు అందజేసినట్టు చెప్పారు. చారిటీ బాక్సు ప్రతినిధులు తాడికొండ కరుణాకర్, కొంతం శివాజీ ప్రసాద్ తో పాటు లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

ఆ ముగ్గురు 'ఉక్కు'ద్రోహులు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంగారావు
- భోగిమంటలో బ్యానర్ దగ్ధం చేసి నిరసన


మోదీ,చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తీరును నిరసిస్తూ వేసిన భోగిమంట

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ద్రోహం చేశారని, ఆయనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు సహకరించారని, ఈ ముగ్గురూ స్టీల్‌ప్లాంట్ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.గంగారావు మండిపడ్డారు. మద్దిలపాలెం కళాభారతి రోడ్డులో వేసిన భోగి మంటలో ఆ ముగ్గురి బొమ్మలతో కూడిన బ్యానర్‌ను వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ మోదీ స్టీల్‌ప్లాంట్‌కోసం ఒక్క మాట కూడా ప్రస్తావించలేదని, పైగా ఆర్సీలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ఇనుప ఖనిజాన్ని పైప్‌లైన్ ద్వారా అందించడానికి సహకరిస్తామని చెప్పుకొచ్చారన్నారు. దానికి వెంటనే బాబు, పవన్‌కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేయడం దుర్మార్గమన్నారు. లక్ష కుటుంబాలకు ఉపాధి ఇస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడానికి మిట్టల్ స్టీల్ వస్తోందని చెప్పారు. విశాఖలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ పెట్టడమంటే ప్రభుత్వస్టీల్ ప్లాంట్‌ను మిట్టల్‌కు అప్పగించేందుకు కుట్ర పన్నడమేనని, ఉద్యోగులను, కార్మికులను బలవంతంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట్లాడడం లేదని, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పల్లెత్తుమాట మాట్లాడకపోవడం తగదని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని, కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని, వీఆర్‌ఎస్‌ను విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జోన్ నాయకులు పి.వెంకటరావు, కుమారి, కుమార్‌మంగళం, త్రినాథ్, జి.వి.ఎస్. చలపతి, జీవి రమణ, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో పండగ శోభ


పూజలందుకుంటున్న జగన్నాథస్వామి


కనకమ్మ ఆలయం


విశేష అలంకారంలో పాండురంగస్వామి


విశేష అలంకారంలో లలితా దేవి


పాండు రంగ స్వామి ఆలయం

ఏయూక్యాంపస్: ఆలయాలు పండగ శోభతో ఆధ్యాత్మిక కాంతులీనుతున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండగల నేపథ్యంలో ఆలయాలను సుందరంగా అలంకరించారు.

స్థానిక చినవాల్తేరు జగన్నాథ స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయంలో ఉదయం అర్చన, అష్టోత్తరనామార్చన, సాయంత్రం వేళ లలితా పారాయణ, భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణ జరుపుతున్నారు. సోమవారం భోగి రోజున గోదా కల్యాణం నిర్వహించనున్నారు. గ్రామస్తులచే అన్న ప్రసాద వితరణ జరుపుతారు.

- బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు గోదా కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ అడపా దేముళ్లు తెలిపారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
- చినవాల్తేరులోని కనకమహాలక్ష్మి ఆలయంలో ఆదివారం సాయంత్రం సంక్రాంతి పండగకు స్వాగతం పలుకుతూ ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. పండగ రోజుల్లో ఆలయాన్ని దర్శించుకునే భక్తులను అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో కె.గాయత్రి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని దుర్గామల్లేశ్వర స్వామి, దుర్గ అమ్మవారి ఆలయాలను అలంకరిస్తున్నారు.
- కిర్లంపూడి లే అవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠంలో పండగ రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయన పురోహితులు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు. సోమవారం పుష్యమాస పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం ఉన్నాయని, సుందరేశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు నిర్వహిస్తామని, భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

కనుమరుగవుతున్న ఉప్పు బండి....

ఏయూక్యాంపస్: గతంలో ఉప్పు కావాలంటే వీధిలోకి బండి వచ్చేది. బండి నిండా ఉప్పు నింపుకొని ప్రతి ఇంటికి వచ్చి ఉప్పు అమ్మేవారు. ఒక రూపాయి ఇస్తే సోలతో దాదాపు కిలో ఉప్పు ఇచ్చేవారు. నేడు వీటి ధర బాగా పెరిగింది. కిలో రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు వీధిలో ఉప్పు బండి రావడం లేదు. ఈ వృత్తిలో కొనసాగే వారు తగ్గిపోతున్నారు. నగరంలో ప్రస్తుతం నలుగురైదుగురు మాత్రమే ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. బరువైన ఉప్పు బండిని లాగుతూ ఎంత దూరమైనా కాలి నడకనే వెళ్లవలసి ఉంటుంది. దీంతో వయసు రీత్యా చాలామంది ఈ వృత్తిని చేయలేక మానివేశారు. ప్రస్తుతం ఈ వ్యాపారం చేస్తున్న వారి పిల్లలు కూడా ఈ వృత్తిలోకి రావడం లేదు. వీరు వేరే ఉపాధి మార్గాలను వెతుక్కుని స్థిరపడుతున్నారు. ప్రస్తుత తరానికి సుపరిచితమైన ఉప్పుబండి భవిష్యత్తులో ఒక జ్ఞాపకంగా నిలచిపోతుంది.


చినవాల్తేరులో ఉప్పుబండి

రామాలంకరణలో సింహాద్రినాథుడు


రామాలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారుడిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను మరొక పల్లకిలో చేర్చి, సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కనుల పండువగా కళవైగళ్ ఉత్సవం


అమ్మవారిని తీసుకువస్తున్న భక్తులు


నివేదనకు సిద్ధం చేసిన పిండివంటలు

ఏయూక్యాంపస్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పాండురంగ స్వామి ఆలయంలో కళవైగళ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భోగి పండగనాడు శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణ ఉత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో ముందురోజున అమ్మవారు, అయ్యవార్లకు ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను మహిళలు, భక్తులు స్వయంగా పల్లకీలో తీసుకువచ్చి, ఆలయం నుంచి ఊరేగించారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. శ్రీ గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా పిండి వంటలు చేసి స్వామి వారికి ఎదుర్కోలు ఉత్సవంలో నివేదించారు.